క్లుప్తంగా


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా సూర్యారావుపేట సెక్షన్, మాచవరం సబ్‌స్టేషన్ దాసాంజనేయ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాచవరం బీఆర్టీఎస్ రోడ్డు, క్యాన్సర్ హాస్పిటల్ ఏరియా, ఏలూరు రోడ్డు, నార్లవారివీధి, కుటుంబరావు వీధి, బుల్లెమ్మ వీధి, కాటూరివారి వీధి, దానయ్య వీధి, పోతినేని వారి వీధి, అక్కుళ్ల తాతయ్య వీధి, దుగ్గిరాల బలరామకృష్ణయ్య వీధి, మాచవరం రైవస్ కాలువ కట్ట ఏరియా పడవలరేవు, బీఆర్టీఎస్ రోడ్డు నుంచి మాచవరం ఆంజనేయ స్వామి గుడి వరకు ఏలూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి, తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

గాంధీనగర్, రైల్వేస్టేషన్ పరిధిలో..

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సబ్ స్టేషన్ రైల్వేస్టేషన్ ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, సబ్ జైల్ ఏరియా, రైల్వేస్టేషన్ రోడ్డు, వెహికల్ డిపో రోడ్డు, రైల్వే కాలనీ, రైల్వే స్టేషన్, పూర్ణనందం పేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో కార్తిక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో బుధవారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో దీపారాధనలు చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం శ్రీ అయ్యప్పస్వామివారి మందిరంలో బుధవారం కార్తిక మాసం పురస్కరించుకుని శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. గురుస్వామి స్వామివారికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు, స్వాములు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

ఆది దంపతులకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై రాజగోపురం ఎదుట కళావేదికపై బుధవారం పలువురు చిన్నారులు తమ కూచిపూడి నృత్యంతో ఆది దంపతులకు నృత్య నీరాజనాలను అర్పించారు. విజయవాడ ప్రణవం ఆర్ట్స్ అకాడమీకి చెందిన ఎం.ప్రణతి, సీహెచ్ అతులిత, తేరాల వర్ధిక, ప్రజ్ఞవి, హిరణ్యలు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం ఆలయ అధికారులు చిన్నారులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు.

చికిత్స పొందుతూ హోటల్ కార్మికుడి మృతి



ప్రసాద్ (ఫైల్)

పాయకాపురం(విజయవాడరూరల్): పైపులరోడ్డు వద్ద ఓ క్యాంటీన్‌లో పని చేస్తూ అనారోగ్యం కారణంగా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ డి.కె.ప్రసాద్(40) అనే కార్మికుడు మంగళవారం మృతి చెందాడు. నున్న పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రసాద్ అనే వ్యక్తి ఈ నెల 15న క్యాంటీన్‌లో కార్మికుడిగా పనిలో చేరాడు. అతడు ఆరోగ్యం బాగోనందున చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విజయవాడ ప్రభుత్వాస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు నున్న పోలీసులు నాన్ మెడికల్ లీగల్ కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలకు ప్రభుత్వాస్పత్రిలో లేదా నున్న పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

అందరి సహకారంతోనే అభివృద్ధికి బాటలు

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- రూ.1.59 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు



రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

పాయకాపురం(విజయవాడరూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజలందరి సహకారంతో సెంట్రల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 63వ డివిజన్‌లో రూ.1.59 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి బుధవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. టీడీపీ గత ఐదేళ్ల పాలన నియోజకవర్గానికి శాపమని, ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడలేదని ఎమ్మెల్యే విష్ణు విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక అభివృద్ధి కార్యక్రమాలపై చక్కని ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. అందులో భాగంగా ఉడా కాలనీలో రూ.1.39 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన రహదారులను ప్రారంభించడంతో పాటు, ఈడబ్ల్యూఎస్ కాలనీ 7వ లైన్‌లో రూ.19.91 లక్షలతో ఇంటర్నల్ క్రాస్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సారథ్యంలో నిత్యం జరుగుతున్న అభివృద్ధి పనులతో సెంట్రల్ నియోజకవర్గం అభివృద్ధికి కేరాఫ్‌గా మారిందన్నారు. ప్రతి డివిజన్‌లోనూ అభివృద్ధిపై ప్రభుత్వ ముద్ర కనిపిస్తోందని చెప్పారు. ప్రధానంగా 63వ డివిజన్‌కు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.20 కోట్ల వ్యయంతో డాక్టర్స్ కాలనీ రోడ్లను పూర్తి చేశామన్నారు. అధికారంలో ఉన్న గత ఐదేళ్ళు ఈ పనులన్నీ ఎందుకు చేపట్టలేకపోయారో టీడీపీ, జనసేన నాయకులు సమాధానం చెప్పాలన్నారు. ప్రస్తుతం నిరసనలు తెలపడానికి సిగ్గుపడాలని తెలిపారు.

ఆదర్శ నగరం..

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గత తెలుగుదేశం హయాంలో నగరంలోని రోడ్లు కనీసం తట్టెడు మట్టికి కూడా నోచుకోలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీఈ(ఇంజినీరింగ్) గురునాథం, ఏఈ మాధవ్, నాయకులు పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, సీహెచ్ రవి, టెక్కం కృష్ణ, తిరుపతిరావు, సూర్యనారాయణ, ఎం.రాజేశ్వరి, పద్మ, నాని, వీఎంసి సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి సైన్స్ ఎక్స్ పో

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏలూరురోడ్డు సీతారామపురంలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్ నందు గురువానం నుంచి నాలుగు రోజుల పాటు సైన్స్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు స్కూల్ అధినేత కె.రాజేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఎక్స్‌పో నిర్వహిస్తున్నామన్నారు. నగరంలోని విద్యార్థులు సైన్స్ ఎక్స్‌పోను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సుపరిపాలనకు కేరాఫ్ సీఎం వైఎస్ జగన్

- వైఎస్ జగన్ పాలనకు మరెవరూ సాటిరారు
- 1వ డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు



1వ డివిజన్‌లో సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో సుపరిపాలనకు కేరాఫ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అభివృద్ధి, సంక్షేమంలో తమ ప్రభుత్వం దేశంలోనే శిఖరాగ్రాన నిలిచిందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 1వ డివిజన్ 2వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఉద్దంటి సునీతతో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి ఘన నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయంలో సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారుల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు.

రూ.10.95 కోట్ల లబ్ధి..

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వాన్ని ప్రజల గడప వద్దకు చేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనకు ప్రజలు అపూర్వ రీతిలో మద్దతు పలుకుతున్నారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా తుంగలో తొక్కి ప్రజలను నిలువునా మోసగించిందని గుర్తుచేశారు. కానీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతనే అందరి జీవితాలు బాగుపడ్డాయన్నారు. 2వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా 8 కోట్ల 27 లక్షల 907 రూపాయలు, నాన్ డీబీటీ ద్వారా 2 కోట్ల 68 లక్షల 42 వేల 905 రూపాయలు మొత్తంగా 10 కోట్ల 95 లక్షల 43 వేల 812 రూపాయల లబ్ధి చేకూర్చిందని చెప్పారు. చంద్రబాబుది మోసకారి ప్రభుత్వమైతే.. సీఎం జగన్ ది సంక్షేమ పాలన అన్నారు. నీతి, నిజాయతీతో పారదర్శక పాలన సాగిస్తున్న జగనన్నని మరోమారు ముఖ్యమంత్రి చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఆళ్ల ప్రసాద్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

యథాతథంగా మేనిఫెస్టో అమలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దేశంలోనే మేనిఫెస్టోను యథాతథంగా అమలు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ కృష్ణా హోటల్ సెంటర్ 252వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఘన నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం వద్ద లబ్ధిదారులకు అందిన సంక్షేమ జాబితాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. 252వ వార్డు సచివాలయ పరిధిలోని ప్రజలకు గత నాలుగున్నరేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా 18 కోట్ల 86 వేల 47 వేల 923 రూపాయల లబ్ధి చేకూర్చిందన్నారు. మరోసారి నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

నూతన వధువుకు మంగళసూత్రాల వితరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): నూతన వధువు సత్యావతి వివాహం సందర్భంగా శ్రీఅప్పన వెంకట కృష్ణయ్య కామేశ్వరమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు అప్పన వెంకట సత్యసాయిబాబు, వెంకట మధురవాణి దంపతులు ఆమెకు మంగళ సూత్రాలు, నూతన వస్త్రాలు, పండ్లు వితరణ చేశారు. వన్‌టౌన్ రథం సెంటర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం నూతన వధువును వారు ఆశీర్వదించి సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివకుమార్, సత్యావతిల వివాహం గురువారం ఉదయం శ్రీయోగానంద లక్ష్మీ నరసింహ దేవస్థానం ప్రాంగణంలో(సూర్యాపేట జిల్లా, అరవపల్లి మండలం) గ్రామంలో జరుగనుందని తెలిపారు. పేద యువతుల వివాహానికి తమ వంతు సాయంగా ఇటువంటి సేవా కార్యక్రమాలను తరచూ నిర్వస్తున్నామని చెప్పారు.

యోగాతో ఆరోగ్యానికి మేలు



గుణదల(విజయవాడతూర్పు): ఒత్తిడిని అధిగమించి మెరుగైన ఆరోగ్యం సమకూరాలంటే యోగా, ప్రాణాయామం వంటి ప్రక్రియలు దోహదపడతాయని ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాల ఆవరణలో యోగాసనాలపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో వృత్తి, వ్యాపార, ఉద్యోగాల్లో ఉండే ప్రజలంతా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఈ ఒత్తిడి కారణంగా మానసిక రుగ్మతలతో పాటు శారీరక బలహీనతలు తలెత్తుతున్నాయని చెప్పారు. వీటిని అధిగమించాలంటే యోగా, ప్రాణాయామం వంటి ప్రక్రియలు అవలంభించాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే పెద్దల మాటను పాటించాలని కోరారు. విద్యార్థులు యోగా చేయటం వలన ఎన్నో లాభాలు ఉన్నాయని తెలిపారు. మానసిక ఒత్తిడి దూరమై జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. ఆత్మ విశ్వాసం పెరిగి మంచి ఫలితాలు సాధించగలుగుతారని చెప్పారు. ప్రతి రోజు యోగా చేయటం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లో యోగాకు ప్రత్యేక స్థానం ఉందని, ప్రతి ఒక్కరూ దీని ఆవశ్యకతను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంటర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ రాజు, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు శుభ, పూనమ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు



పోలీస్ అధికారులకు సూచనలిస్తున్న డీసీపీ విశాల్ గున్ని

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి విజయవాడ కమిషనరేట్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఈస్ట్ జోన్ డెప్యూటీ పోలీస్ కమిషనర్ విశాల్ గున్ని, సెంట్రల్ ఏసీపీ భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీసుల బృందం బుధవారం బెంజిసర్కిల్-పటమటలంక తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా డీసీపీ విశాల్ గున్ని మాట్లాడుతూ విజయవాడ అవుటర్ రింగ్ రోడ్డు పనులు పూర్తయితే నగరంపై కొంత వరకు ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా ఎక్కువగా ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రదేశాలను, రోడ్డు ఆక్రమణలను గుర్తించామని స్వల్ప మార్పులు చేసి ట్రాఫిక్‌ను నిరోధించేందుకు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించామని తెలిపారు. అధికారులందరితో కలిసి ట్రాఫిక్ సమస్యపై చర్చించి వారి సలహాలను తీసుకుంటామని, ప్రజలు, వాహనదారులు కూడా సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని, పబ్లిక్, పోలీస్‌ల ఇద్దరి సహకారంతోనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. అంతకుముందు పరిసర ప్రాంతాలైన ప్రధాన కూడళ్లను, బెంజ్ సర్కిల్, బందర్ రోడ్, ఏలూరు రోడ్, నేషనల్ హైవేపై సిగ్నల్స్‌లను పరిశీలించి అధికారులకు, సిబ్బంది తగు సూచనలు అందించారు. ఈ పర్యటనలో ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్, 2వ ట్రాఫిక్ ఏసీపీ జె.వెంకట నారాయణ, సౌత్ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమమే పరమావధిగా పాలన

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే విష్ణు



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ 239వ వార్డు సచివాలయ పరిధిలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలతో మమేకమై అర్జీలు స్వీకరించారు. ఇప్పటికే నగరాన్ని ఎంతో విస్తరించామని.. వినాయక్ నగర్, వై.వి.రావు ఎస్టేట్‌లోనూ ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజలకు అందుబాటులో ఉంటున్నామన్నారు. 'జగనన్న సురక్ష' ద్వారా నియోజకవర్గంలో 36,367 మందికి 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేయడం ఒక మైలురాయి అని చెప్పుకొచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని 52,519 మంది సద్వినియోగం చేసుకున్నారన్నారు. అనంతరం ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలించారు.

టిడ్కో ఇళ్లపై టీడీపీకి మాట్లాడే అర్హత లేదు

టిడ్కో ఇళ్ల గూర్చి మాట్లాడే నైతిక అర్హత టీడీపీకి ఏ మాత్రం లేదని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. ఆనాడు నగరంలో 11,917 మంది దగ్గర డబ్బులు వసూలు చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. కేవలం కాగితాల్లో ఇళ్లను చూపి.. ఒక్కో లబ్ధిదారుని వద్ద రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అప్లికేషన్ల రూపంలో దోచుకు తిన్నారన్నారు. ఇందులో 6,576 ఇళ్లు 50 శాతం కూడా పూర్తికాలేదని.. 5,341 మందికి కనీసం స్థలం కూడా చూపలేదన్నారు. ఇదంతా తెలుగు తమ్ముళ్ల అవినీతి కాదా..? సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబు మోసగించిన టిడ్కో లబ్ధిదారులకు.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పూర్తి న్యాయం జరిగిందని మల్లాది విష్ణు అన్నారు. నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, అంజిరెడ్డి, వసంత్, గోపాల్ రెడ్డి, శర్మ, తోపుల వరలక్ష్మి, శోభన్, విజయసారథి, జమలయ్య, మహేశ్వరి, ఇ[illegible]ర నాయకులు, అన్ని శాఖల అధికార[illegible]లు, సచివాలయ సిబ్బ[illegible]ది పాల్గ[illegible]న్నారు.

● కపోతాల కనువిందు



నగరంలోని పాత శివాలయం ఆవరణలో పెద్ద సంఖ్యలో పావురాలు కనువిందు చేస్తున్నాయి. ప్రతి రోజు నగర వాసులు పావురాలకు ఆహారం అందిస్తారు. ఈ క్రమంలో బుధవారం పావురాలకు ఆహారం ఇస్తున్న చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



పోలీస్ అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్ అధికారులతో బుధవారం సమీక్షించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు రద్దీగా ఉన్న పలు ప్రాంతాలను గుర్తించి, ప్రయాణికుల సౌకర్యార్థం ట్రాఫిక్‌ను తగ్గించి ప్రమాదాలకు నివారణగా చర్యలకు పలు సూచనలు చేశారు. ఈ మేరకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎల్లప్పుడు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రజల శ్రేయస్సు ప్రధానమని, అందుకు అవసరమైన సహాయ సహకారాలు, సదుపాయాలు, చర్యలు తీసుకోటానికి వీఎంసీ సిద్ధంగా ఉందని అన్నారు. సమావేశంలో ఏడీసీపీ(ట్రాఫిక్) ప్రసాద్, ఏసీపీ(ట్రాఫిక్) వెంకటనారాయణ, ఏసీపీ(సౌత్) రవికిరణ్, ఏసీపీ(సెంట్రల్) భాస్కర్, కృష్ణలంక సీఐ ఎంవీ దుర్గారావు, వీఎంసీ డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సిరస్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(పార్క్స్) ఏఎస్ఎన్‌ప్రసాద్ పాల్గొన్నారు

మహోన్నత వ్యక్తి సంజీవరాయ శర్మ



సభలో మాట్లాడుతున్న మురళీప్రసాద్

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నవారు చేయలేని గణిత అద్భుతాలు చేసిన మహోన్నత వ్యక్తి, అంధ గణిత పండితుడు లక్కోజు సంజీవరాయ శర్మ అని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దివాకరుని వెంకట మురళీ ప్రసాద్ కొనియాడారు. సంజీవరాయ శర్మ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరమ్(ఏపీఎంఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మురళీ ప్రసాద్ మాట్లాడుతూ సంజీవరాయ శర్మకు పుట్టిన తేదీ చెబితే చాలు వారం, తిథి, నక్షత్రం చెప్పేవారని గుర్తు చేశారు. ఆయన ఆరు వేలకుపైగా గణిత అవధానాలు చేశారని చెప్పారు. ఎంత పెద్ద గణిత సమస్య అయినా మనసులోనే లెక్కించుకుంటూ తనకిష్టమైన ఫిడేలు వాయిస్తూ సమాధానం ఇచ్చేవారని తెలిపారు. ఆయన ప్రతిభను గుర్తించే నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్, తదితర ప్రముఖులు అభినందించేవారని అన్నారు. ఆయన జీవించి ఉన్న కాలంలో ఈ పాఠశాల సిబ్బందికి రాసి పంపిన లేఖలో ఆయన వేలి ముద్రలు వేసి పంపించారని గుర్తు చేస్తూ ఆ లేఖను ప్రదర్శించారు. పాఠశాల గణిత క్లబ్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న గణిత సిబ్బంది కె.జ్యోతిర్మయి, కె.సుమలత, తెలుగు పండితులు, యూట్యూబర్ ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ శర్మ జీవిత చరిత్ర నుంచి నేటి తరం తెలుసుకుని స్ఫూర్తి పొందాలన్నారు. ముఖ్యంగా శర్మ మన తెలుగువారు కావడం గర్వకారణమన్నారు. లక్కోజు సంజీవరాయ శర్మ జీవిత చరిత్రపై విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీలో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు.

కుటుంబం నుంచే లింగ సమానత్వం రావాలి



మాట్లాడుతున్న దిశ పోలీస్‌స్టేషన్ సీఐ వాసవి

పటమట(విజయవాడతూర్పు): లింగ సమానత్వం అనేది కుటుంబ వ్యవస్థ నుంచే రావాలని, ప్రతి తల్లి కూడా తమ బిడ్డలను ఆడ మగ అనే తేడా లేకుండా పెంచాలని దిశా పోలీస్‌స్టేషన్ సీఐ వాసవి అన్నారు. స్టెల్లా కాలేజీలో డిగ్రీ విద్యార్థినులకు లింగ సమానత్వం- ఒత్తిడిని జయించటం అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

యువత భాగస్వామ్యం కావాలి

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ వాసవి మాట్లాడుతూ.. స్త్రీ, పురుషుల మధ్య తేడాలు ఉండకూడదని, దీనిపై ప్రభుత్వం అనేక చట్టాలు చేసిందని, లింగ నిర్ధారణ చేయటం నేరమని, అలాగే మహిళలు లింగ అసమానత్వం వల్ల హింసను ఎదుర్కొంటే చట్టాల ద్వారా శిక్షలు పడతాయన్నారు. మహిళలు, పిల్లల హక్కులు కాపాడటంలో వారికి భద్రత కల్పించటం రాష్ట్రంలో దిశ పోలీస్ స్టేషన్లు ఎంతగానో కృషి చేసి ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. మహిళలు బాలల హక్కులు పరిరక్షించటంలో యువత భాగస్వాములు కావాలని, ఆపద వచ్చినప్పుడు, 1098 కు లేదా 181కు ఫోన్ చేస్తే వారికి భద్రత కల్పిస్తామని తెలిపారు.

సమతుల్య ఆహారం తీసుకోవాలి..

మానసిక నిపుణురాలు మానస మాట్లాడుతూ అసమతౌల్యపు ఆహార అలవాట్లు, నిద్ర లేకుండా మెల్కోవటం, మొబైల్‌కు అడిక్ట్ అవటం, ఎక్కువసేపు మేల్కొని ఉండటం, జంక్ ఫుడ్ అధికంగా గా తీసుకోవటం వంటి పలు కారణాల వల్ల గుండె జబ్బులు అధికం అవుతున్నాయన్నారు. ఇటీవల కాలంలో వయసుతో సంబంధం లేకుండా గుండె జబ్బులు వస్తున్నాయంటే అందుకు ఒత్తిడి ప్రధాన కారణమని, ఒత్తిడిని ఎదుర్కోవటానికి యోగ, మెడిటేషన్ చేయాలని సమతుల్య ఆహారం తీసుకోవాలని చెప్పారు. సరైన జీవన సరళిని అలవర్చుకోవటం ద్వారా ఒత్తిడిని జయించవచ్చన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు బాలల-మహిళల హక్కులు పరిరక్షించటంలో కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ జిల్లా కో ఆర్డినేటర్ రమేష్, సెక్రటరీ, ప్రకాష్, ఇంటర్మీడియెట్ కో ఆర్డినేటర్ స్వప్న ఉన్నాం, పద్మావతి, శ్రావణ కృష్ణకుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే సహించేది లేదు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రహదారులపై వ్యాపారాలు చేసుకునే హాకర్లు వారు విక్రయించే వస్తువులు, వాహనాలను రోడ్లపై నిలపకుండా చూసుకోవాలని ఎస్ఎన్‌పురం సీఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు ఎస్ఎన్‌పురం సీఐ వెంకటనారాయణ, సిబ్బందితో కలసి గాంధీనగర్, సాంబమూర్తిరోడ్డులో పర్యటించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తూ రోడ్లపై వ్యాపారాలు చేస్తున్న హాకర్స్, షాపుల నిర్వాహకులతో మాట్లాడారు. బాటసారులకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తమ వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. రోడ్లపైకి వచ్చేలా తమ వస్తువులను ఉంచినా, వినియోగదారులు దుకాణాల ఎదుట రోడ్లపై వాహనాలు నిలిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో త్రీ టౌన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఎన్ పురం ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు, ఎస్ఎస్ రంగనాథుడు, ఉమెన్ ఎస్ఐ దుర్గాభవాని, సిబ్బంది పాల్గొన్నారు.